
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 కనిష్ఠం 18.2



కామారెడ్డి జిల్లా వార్తలు

5

బుధవారం 13 నవంబరు 2024

కవిత పోటీల్లో జిల్లావాసి ప్రతిభ

కామారెడ్డి టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాకు చెందిన కవి సాయికిరణ్ సదానంద్ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన జాతీయస్థాయి కవితా పోటీల్లో పాల్గొని చక్కటి ప్రతిభను కనబరిచారు. భారత్ కల్చరల్ అకాడమి, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కాళోజీ స్మారక జాతీయస్థాయి కవిత పోటీల్లో కవితాగానం చేసినందుకు గాను టీవీ నటుడు రచయిత నాగబాల వి.సురేష్‌కుమార్, సినీపాటల రచయిత మౌన శ్రీమల్లిక్, సినీ దర్శక నిర్మాత ప్రభాకర్ చేతుల మీదుగా కాళోజీ ప్రతిభా పురస్కారం అందుకున్నారు.

కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు




కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాలభైరవ స్వామి ఆలయంలో కార్తీక మాసం, దేవుత్తని ఏకాదశి మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్ఛారణలతో పాలాభిషేకం, సింధూర ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైభవంగా భక్తులు హాజరై దీపారాధన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. కామారెడ్డి జిల్లాతో పాటు పలు జిల్లాల భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. అనంతరం శనేశ్వర, నాగదేవత, శివాలయం, నవగ్రహాల గుడి దేవుళ్లకు మొక్కులు మొక్కి పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయం ఆవరణలో గల బావి నీటితో స్నానాలు చేసి తడి బట్టలతో భైరవుని గర్భగుడిలో తడి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభు రామచంద్రం గుప్తా, ఎస్ఐ నరేష్, ఎంపీడీవో ఏలేటి తిరుపతిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు సతీష్ గుప్తా, శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



దీపారాధన నిర్వహిస్తున్న మహిళలు

కుడా చైర్మన్ పదవిపై.. ఆశలు!



కామారెడ్డి పట్టణ ముఖ చిత్రం

- పరిధి విస్తరించడంతో పెరిగిన ప్రాధాన్యం
- మూడు మున్సిపాలిటీలు, 460 గ్రామాలతో ఏర్పాటైన కుడా
- కుడా చైర్మన్ పదవికి పోటీ పడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు
- డైరెక్టర్ పోస్టులకు సైతం డిమాండ్
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యేల వద్ద పైరవీలు
- తమ నియోజకవర్గానికే చైర్మన్ పదవి ఇవ్వాలంటున్న ఎమ్మెల్యేలు
- పలువురు పేర్లను సిఫారస్ చేసిన ఎమ్మెల్యేలు

కామారెడ్డి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్తగా మంజూరైన కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) చైర్మన్ పదవిపై పలువురు నాయకులు ఆశలు పెట్టుకుంటున్నారు. ఈ పదవిని దక్కించుకునేందుకు సదరు నాయకులు తమ ఎమ్మెల్యేలపై ఒత్తిడి పెంచడంతో పాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డిల ఆశీస్సులు పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మొదట కామారెడ్డి మున్సిపాలిటీకే పరిమితం అవుతుందనుకున్న దాదాపు జిల్లా అంతటా విస్తరించడంతో చైర్మన్, డైరెక్టర్ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య పెరుగుతుంది. పదవులను ఆశించే నాయకులు ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు. అదేవిధంగా తమ నియోజకవర్గానికే కుడా చైర్మన్ పదవి ఇవ్వాలంటూ ఆయా ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఆయా నియోజకవర్గాల నుంచి ఒక్కో పేరు చొప్పున ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి చైర్మన్ పదవికై సిఫారస్ చేసినట్లు తెలిసింది. చైర్మన్ పదవికై ముగ్గురు నేతల మధ్యే తీవ్ర పోటీ ఉన్నట్లు సమాచారం.

మూడు మున్సిపాలిటీలు.. 460 గ్రామాలతో కుడా

గత ప్రభుత్వ హయాంలో ఆయా జిల్లాలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేసింది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోనూ కుడా ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రతిపాదించారు. కానీ ఫైల్ మాత్రం ముందుకు కదలలేదు. గ్రామాలను కుడా పట్టణాల మాదిరి తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పలు జిల్లాలో కొత్తగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేసి మున్సిపాలిటీలతో పాటు గ్రామాలను కూడా విలీనం చేసింది. పట్టణాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ఇచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను పెంచింది. అందులో భాగంగానే జిల్లాకు కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మంజూరు చేసింది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మూడు మున్సిపాలిటీలతో పాటు 460 గ్రామాలను విలీనం చేస్తు కుడాను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 535 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 70 శాతానికి పైగా కుడాలో కలిపారు. మొదట కామారెడ్డి మున్సిపాలిటీకే కుడా పరిమితం అవుతుందనుకున్న పరిధి జిల్లా మొత్తం విస్తరించడంతో ప్రాధాన్యత మరింత పెరిగింది. కుడా చైర్మన్, డైరెక్టర్ పదవులపై కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు చెందిన నాయకులు సైతం ఆశలు పెంచుకున్నారు. ప్రస్తుతానికి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వైస్ చైర్మన్‌గా ఉన్నారు.

చైర్మన్, డైరెక్టర్ పోస్టులకు ఎందుకింత పోటీ

రియల్ ఎస్టేట్ లేఅవుట్‌లు, పరిశ్రమల భవనాలు ఇతరత్రా నిర్మాణాల అనుమతులు కూడ నుంచే తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్రం నుంచి కుడా మౌలిక వసతుల కల్పనకు నిధులు కూడా బాగానే వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా జిల్లాలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రొటోకాల్ కలిగి ఉండడం, ప్రత్యేక వాహనం అలవెన్స్‌ల సౌకర్యం ఉండడంతో ఎలాగైన కుడా చైర్మన్ పదవి దక్కించుకోవాలని తహతహలాడుతున్నారు. జిల్లాలో ఎక్కడ నలుగురు కలిసిన కుడా చైర్మన్ ఎవరు అవుతారనే చర్చ జరుగుతోంది. నాలుగు నియోజకవర్గాల నుంచి కుడా చైర్మన్‌కై పలువురు సీనియర్ నేతలు పోటీ పడుతున్నారు. తమకంటే తమకే చైర్మన్ పదవి వస్తుందని ఆయా నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన నాయకులు చైర్మన్ పదవిపై తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ప్రజాప్రతినిధులపై ఒత్తిడి

కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి (కుడా) చైర్మన్‌తో పాటు ముగ్గురు డైరెక్టర్‌ల నామినేట్ పదవులు ఉంటాయి. చైర్మన్ ముగ్గురు డైరెక్టర్‌లతో కలిసి కుడా పాలకవర్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ పదవులను దక్కించుకునేందుకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తీవ్ర పోటి పడుతున్నారు. చైర్మన్ పదవికై పోటీ నెలకొంటుంది. ఈ పదవిని దక్కించుకునేందుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, పోచారం

(మిగతా 8వ పేజీలో)

ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ జరిగేనా?



నిజాంసాగర్ ప్రాజెక్టు

- ఆలస్యమైన చేప పిల్లల విడుదల
- లబోదిబోమంటున్న మత్స్య కారులు
- రిజర్వాయర్లలో నీలకంఠ రొయ్యలు విడుదల ఏడాది లేనట్లేనా?
- ముందుగా చిన్న చెరువుల్లో చేప పిల్లల విడుదలయ్యేనా?
- నిజాంసాగర్‌లో ఏడాది నీలకంఠం రొయ్యల విడుదల లేనట్లేనా?
- చేప పిల్లల విడుదల నిజాంసాగర్‌లో 24 లక్షలలేనా?

నిజాంసాగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏడాది చేప పిల్లల విడుదల సగానికి సగమైన అనేది ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో 572 చెరువులు నిజాంసాగర్ కౌలాస్ నాలా ప్రాజెక్టులతో పాటు సింగీతం రిజర్వాయర్లలో చేప పిల్లల విడుదల ఎప్పుడు చేస్తారని మత్స్యకార్మికులు ఎదరు చూస్తున్నారు. ఏడాది చేప పిల్లల విడుదల ఆలస్యమైనప్పటికీ గత నెలాఖరు నుంచి చేప పిల్లల విడుదలకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టారు. జిల్లాలో 572 చెరువులకు గాను ఇప్పటి వరకు 81లక్షల 30,972 చేప పిల్లలను విడుదల చేశారు. నిజాంసాగర్ కౌలాస్ నాలా ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల ఇప్పటికీ విడుదల జరగలేకపోయింది. ఈ ఏడాది కౌలాస్‌నాలా ప్రాజెక్టులో 4,98,540, సాగర్‌లో 24 లక్షల 975, సింగీతం రిజర్వాయర్‌లో 99 వేల చేప పిల్లల విడుదల చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించారు. ఏడాది చేప పిల్లల విడుదల ఆగస్టు, సెప్టెంబరు మాసంలో చేయాల్సి ఉన్నప్పటికీ చేప పిల్లల సరఫరాదారులైన కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో చేప పిల్లల విడుదలకు ఆలస్యానికి కారణమైనట్లు సమాచారం. చేప పిల్లలను సరఫరా చేసే కాంట్రాక్టర్లకు రెండేళ్లుగా బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొనలేక పోయారు. ఏడాది ఉచిత చేప పిల్లల విడుదల చేయాల్సిన ప్రభుత్వం ఆదారబాదరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి సగానికి సగమే చెరువు కుంటలతో పాటు రిజర్వాయర్లు ప్రాజెక్టులో విడుదల చేయాలని ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో మత్స్యశాఖ అధికార యంత్రాంగం అక్టోబరు చివరి వారం నుంచి చేప పిల్లల విడుదలకు శ్రీకారం చుట్టింది. కామారెడ్డి జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గంలోని చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేసేందుకు ఆయా మత్స్య సంఘాలకు మండల కేంద్రంలోని చేప పిల్లల విత్తనాన్ని తీసుకువచ్చి పాలిథిన్ కవర్లలో సంఘాలకు పంపిణీ చేస్తూ ఉన్నారు. అధికార యంత్రాంగం ప్రతీ ఒక్క చెరువును సందర్శించి చేప పిల్లలను విడుదల చేయాల్సి ఉండగా కేవలం మండల కేంద్రంలోని ఎంపీడీవో తహసీల్దార్ కార్యాలయాల్లోని చేప పిల్లలను మత్స్య కార్మికులకు పంపిణీ చేస్తూనే ఉన్నారు. ఏడాది ఆలస్యంగా చేప పిల్లలు విడుదల చేస్తున్నప్పటికీ సగానికి సగమే విడుదల చేయడంతో మత్స్య కార్మికుల నిరాశ చెందుతున్నారు. ఏడాది లక్ష్యాన్ని మించి చేప పిల్లలు విడుదల చేస్తారని అనుకున్న కార్మికులకు నిరాశగానే మిగిలిపోయింది. చేప పిల్లలను వరంగల్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ సరఫరా చేస్తూనే ఉన్నారు. ఈ చేప పిల్లలు ఎన్ని అంగుళాలు ఉంటాయో అనే అంశాన్ని కూడా అధికారులు వెల్లడించకపోవడం పట్ల సర్వత్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఉచిత చేపపిల్లల పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం 2016-17 ఆర్థిక సంవత్సరంలో మత్స్య కార్మికుల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రస్తుత ప్రభుత్వంలో చేప పిల్లలను సగానికి సగంగానే విడుదల చేయడమే కాకుండా మత్స్య సంఘాలకు పంపిణీ చేస్తూనే ఉన్నారు. నిజాంసాగర్ కౌలాస్ ప్రాజెక్టుల్లో ఎప్పుడు విడుదల చేస్తారనేది అంతుపట్టడం లేదు. ఇక లేనట్లేనని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకులు స్పందించి ప్రతీయేటా విడుదల చేసిన ప్రణాళిక ప్రకారమే చేప, రొయ్య, పిల్లలను విడుదల చేయాలని మత్స్య కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించే పార్టీ కాంగ్రెస్

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించే ఒకే ఒక పార్టీ కాంగ్రెస్ అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. మంగళవారం మహారాష్ట్రలోని ధర్మాబాద్‌లో జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ అసత్యప్రచారం చేస్తుందని అన్నారు. తెలంగాణ ఇచ్చిన మాట ప్రకారం గ్యారెంటీలను పేదలకు అంది స్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన 10నెలల కాలంలోనే 50వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మహాలక్ష్మీ ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆడ బిడ్డలకు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. అదాని, అంబానిలకు మేలు చేయాలని ప్రధాని భావిస్తున్నారని అన్నారు.

వరి కొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు!

- గ్రామాల్లో వరి కొయ్యలకు నిప్పు పెడుతున్న రైతులు
- నిప్పు పెట్టడంతో భూసారం దెబ్బ తింటుందంటున్న వ్యవసాయ శాఖ అధికారులు
- భూమిలోని మిత్ర పురుగులు అంతరిస్తాయి: శాస్త్రవేత్తలు

7



గ్రూప్-3 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రూప్-3 పరీక్షను పకడ్బందీగా, ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో గ్రూప్-3 పరీక్ష నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17,18 తేదీల్లో జరిగే పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కామారెడ్డి పట్టణంలో 20 కేంద్రాల్లో 8268 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని, ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఆయా కేంద్రాల్లో ఎవరిని అనుమతించకూడదని తెలిపారు. అన్ని కేంద్రాలను పోలీసు అధికారులు ముందస్తుగా స్క్రీనింగ్ చేయాలని తెలిపారు. కేంద్రానికి ప్రహరీలేనట్లయితే అదనంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ కేంద్రం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటుతో పాటు బయోమెట్రిక్ హాజరు తీసుకోవాలని తెలిపారు. అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించే ముందు వారిని క్షుణంగా పరిశీలించి పంపించాలన్నారు. ఈ నెల 14న శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు సమయనుకూలంగా పరీక్షకు ముందు, పరీక్ష అనంతరం ఆర్టీసీ బస్సులను నడిపించాలని డీపో మేనేజర్‌ను ఆదేశించారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ప్రతీ సెంటర్‌లో ప్రాథమిక చికిత్స కిట్‌తో పాటు ఏఎన్‌ఎంలను నియమించాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు.పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని హాల్‌లోకి ఎవరిని కూడా సెల్‌ఫోన్‌తో హాజరుకాకుండా చూడాలని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి అరగంట ముందే హాజరు కావాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, అదనపు ఎస్పీ నరసింహరెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, రిజనల్ కోఆర్డినేటర్ విజయ కుమార్, ఇంచార్జ్‌మున్సిపల్ కమీషనర్ వేణుగోపాల్, డీయంహెచ్‌వో చంద్రశేఖర్, డీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఎన్యూమరేటర్లను నియమించుకోవాలి

నిబంధనల మేరకు ఎన్యూమరేటర్లను నియమించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌నుండి జిల్లాలోని తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేకాధికారులతో ఇంటింటి సమగ్ర సర్వేపై మండలాల వారిగా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఎన్యూమరేటర్ రోజుకు 15 నుండి 20 వరకు ఇళ్లకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని, అందుకు అవసరమైన పక్షంలో ఎన్యూమరేటర్లను నియమించుకోవాలని తెలిపారు. ఈబీ వారిగా సమీక్షిస్తు కొంతమంది తక్కువ ఎన్యూమరేషన్ చేస్తున్నారని వారు త్వరత్వరగా సమాచారాన్ని సేకరించాలని తెలిపారు.సమగ్ర సర్వే నిక్షిప్తం కోసం అవసరమైన కంప్యూటర్‌లు,కంప్యూటర్ ఆపరేటర్‌ల వివరాలు ఆయా మండల పరిషత్ అధికారులు స్ప్రెడ్ షీట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, ఆర్డీవో రంగనాథరావు, సీపీఓ రాజారాం తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు వరం కల్యాణ లక్ష్మి

● రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం



వర్నిలో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

వర్ని,నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలకు వరంలాంటి పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు అని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. వర్ని మండల కేంద్రంలో మంగళవారం వర్ని ఉమ్మడి మండలాలకు చెందిన పలువురికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి కృషితో అందిస్తున్న ఈ సహాయంతో ఆడబిడ్డల తల్లిదండ్రులకు భరోసా నింపుతుందని వెల్లడించారు. ప్రతి ఆడబిడ్డకు ఈ పథకం వరంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాటు అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బోధన్‌రూరల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందని బోధన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని బెల్లాల్ చెరువులో మత్స్యకారుల సంక్షేమం కోసం 1,99,500 రూపాయలు చేప పిల్లల కోసం మంజూరయ్యాయని, చేప పిల్లలను కొనుగోలు చేసి బెల్లాల్ చెరువులో విడుదల చేయడం జరిగిందన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చేప పిల్లల రకాలు బొచ్చ, రాహు, బంగారు తీగ చేపలను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ ఏడీ ఆంజనేయులు, బోధన్ తహసీల్దార్ విఠల్, కౌన్సిలర్ శరత్ రెడ్డి, దాము, వ్యవసాయ శాఖ ఏఈవో కృష్ణవేణి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కోట అబ్బయ్య కుల పెద్దలు గంగాధర్, భూయ్య, సుల్తాన్ సాయిలు, నడ్పి లక్ష్మయ్య, దాల్‌మల్క శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్, టిప్పర్ పట్టివేత

బోధన్‌రూరల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి):అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌తో పాటు ఒక టిప్పర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు బోధన్‌రూరల్ ఎస్ఐ మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. కొప్పర్గ,సాలూర శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మోర్తాడ్‌లో ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ

మోర్తాడ్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాప్‌లో మంగళ వారం జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ తనిఖీ చేశారు. ఫర్టిలైజర్‌షాప్‌లో ఎరువుల అమ్మకాల వివ రాలను అడిగితెలుసుకున్నారు. పురుగు మందులు, ఇతర మందులు రైతులు కొనుగోలు చేసినప్పుడు రశీదు ఇవ్వాలని ఆదేశించారు. ఎరువులు అధిక ధరలకు అమ్మవద్దని, దుకాణం ఎదుట ఎరువుల వివరాలను, ధరలతో సూచికబోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరీష్‌కుమార్, డీలర్‌సునీల్, వంశీ, దిలిప్ పాల్గొన్నారు.

ఒకరికి రెండు రోజుల జైలు

బోధన్‌రూరల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): బోధన్ కోర్టులో మంగళవారం గుట్కా, పాన్ మాసాల తరలించిన వ్యక్తికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమాన విధించారని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 30-10-2024 సాలూర చెక్‌పోస్టు వద్ద గుట్కా, పాన్ మాసాల తరలిస్తున్న వ్యక్తి ఆజామ్ మహ్మద్ యూసుఫ్‌కు మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ముందు నేరం అంగీకరించినందుకు రెండురోజుల జైలుశిక్షతో పాటు 5వేల రూపాయల జరిమాన విధించారన్నారు. గుట్కా,పాన్ మాసాలను ఇతర రాష్ట్రాల నుండి తరలించవద్దని బోధన్‌రూరల్ ఎస్ఐ మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.గుట్కా, పాన్ మాసాల తరలిస్తే జైలుశిక్షతో పాటు కఠిన చర్యలు ఉంటాయన్నారు.

బోధన్ ఉపాధ్యాయులకు ఐకాన్ అవార్డు

బోధన్‌రూరల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని క్రిసెంట్ హైస్కూల్ సీనియర్ ఉపాధ్యాయులకు టీచర్స్ ఐకాన్ అవార్డు వరించింది. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మైనారిటీ విద్యాసంస్థల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కేఎల్ఎన్ ఆడిటోరియంలో మంగళవారం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిసెంట్ హైస్కూల్ ఉపాధ్యాయులు అఫ్సన్ జబీన్, నస్రిన్ బేగంలకు టీచర్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి తేమ్రిస్ వైస్ చైర్మన్ మహ్మద్ ఫయిమొద్దీన్, ప్రొఫెసర్ అమీరుల్లా ఖాన్ హజరయ్యారు. ఈ సందర్భంగా క్రిసెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ జావీద్ మాట్లాడుతూ అత్యుత్తమ సహకారం, యోగ్యత, వినూత్న బోధనను అందించిన తమ పాఠశాల ఉపాధ్యాయినులకు ఐకాన్ అవార్డు లభించడం అభినందనీయమన్నారు.

నూడా విస్తరణ వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి

ఆర్మూర్ టౌన్, నవంబర్12(ఆంధ్రజ్యోతి): నూడా విస్తరణ వల్ల ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ లబ్ధి కొరకు నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని విస్తరించాలని చూస్తుందని, నగర పాలక సంస్థతో పాటు బోదన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలు, అలాగే 541 గ్రామపంచాయతీలు ఉన్నాయని, నూడా పరిధిలో ఇదీ వరకే బోదన్, నిజామా బాద్‌రూరల్, ఆర్మూర్ అసెంబ్లీకి సంబంధించిన 73గ్రామాలు నూడా పరిధిలో ఉన్నాయని, ఇంక విస్తరించాలని చూస్తున్నారని, దీని వల్ల ప్రజలకు చాలా ఇబ్బంది కలుగుతుందని, భీమ్‌గల్, బోధన్ నుంచి జిల్లా కేంద్రంలో నూడా కార్యాలయానికి వచ్చి పనులు చేసుకోవాలంటే అవసలు పడాల్సిన వస్తుందని కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే నూడా విస్తరణను అపి బోదన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలకు డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధానకార్యదర్శి పొల్కం వేణు, ఉపాధ్య క్షుడు ఆరే రాజేశ్వర్, పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, నవంబర్12(ఆంధ్రజ్యోతి) మున్సిపల్ పరిధిలోని 24, 25 వార్డులలో జరుగు తున్న సమగ్ర సర్వేను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు.తప్పులు లేకుండా సరైన సమాచారాన్ని సేకరించి సర్వేలను పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఆయనవెంట సూపర్ వైజర్ నరేందర్ ఉన్నారు.

చౌట్‌పల్లిలో లక్ష తులసి దళాలార్చన

కమ్మర్‌పల్లి,నవంబరు 12:(ఆంధ్రజ్యోతి) చౌట్‌పల్లిలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనారయణ స్వామి ఆలయంలో మంగళవారం లక్ష తులసిదళాలతో విశేష అర్చన కార్యక్రమాన్ని ఘనంగ నిర్వహించారు. వేదపండితులు రాష్ట్ర అవార్డు గ్రహిత గురుమంచి చంద్రశేఖర శర్మ అద్వర్యంలో శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఉత్సవ మూర్తులకు వేదక్తంగా పంచామృతాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

నవీపేట,నవంబరు12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా లగచెర్లలో సోమవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు ఇతర ఉద్యోగులపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, మండల రెవెన్యూ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ దేవిసింగ్, సిబ్బంది ఉన్నారు.

కమ్మర్‌పల్లి: లగచర్లలో ఫార్మ కంపెని ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం వెల్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు అక్కడకు చేరుకున్న తహసీల్దార్ తదతర రెవెన్యూ ఉద్యోగులపై అక్కడి రైతుల దాడిని తీవ్రంగా ఖండిస్తూ రెవెన్యూ ఉద్యోగులు మంగళవార ఉదయం నల్లబ్యాడ్జీ ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల తహసీల్దార్ అంజనేయులు, ఆర్ఐ, టైపిస్టు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బషీరాబాద్‌లో పెద్దమ్మ జాతర



బషీరాబాద్‌లో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



యజ్ఞంలో పాల్గొన్న దంపతులు

కమ్మర్‌పల్లి, నవంబరు 12: (ఆంధ్రజ్యోతి) మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులో కొలువుదీరిన ముదిరాజ్‌ల ఆర్యాదైవం పెద్దమ్మ అలయ 12వ వార్షికోత్సవాన్ని పురష్కరించుకుని బుధవారం ఆలయంవద్ద జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ముదిరాజ్ సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం అలయం వద్ద సహస్ర కుంకుమార్చన, యజ్ఞ కార్యక్రమాన్ని అలయ పూజారి కృష్ణ పంతులు, శ్రీనివాస్, సతీష్‌ల ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు ముదిరాజ్ సంఘ మ హిళలు, దంపతులు యజ్ఞ కార్యక్రమంలో పా ల్గొన్నారు. బుధవారం జాతర సందర్భంగా ఉదయం నుండి సాయంత్రం వరకు అలయం వద్దప్రత్యేక పూజా కార్యక్రమాలు, బోనాల ఊరేగింపు,పూర్ణాహుతి, పల్లకీసేవతో పాటు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు.భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనిఅ మ్మవారి ఆశీర్వాదాలు అందకోవాలని కోరారు.కార్యక్రమంలో ముదిరాజ్ సంఘాల సభ్యులు బోడ చిన్న ముత్తన్న, యామగంగాధర్, పిట్ల రా జన్న, మరంపల్లి అశోక్, పట్ల గంగాధర్, గుం డ బోయిన ముత్తన్న పెద్దమ్మ దీక్షపరులు, గ్రామముదిరాజ్ సంఘం,మహిళలు పాల్గొన్నారు.

తులం బంగారం పథకాన్ని వెంటనే ప్రవేశపెట్టాలి

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



భీమ్‌గల్‌లో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్ అంతర్ పాఠశాల క్రీడోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భీమ్‌గల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులతో పాటు లబ్ధిదారులకు తులం బంగారాన్ని వెంటనే అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. మంగళవారం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య, మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలతలతో కలిసి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దమాట్లాడుతూ పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గలిపిస్తే కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులతో పాటు తులం బంగారాన్ని అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 11నెలలు అవుతున్న తులం బంగారం మాత్రం అందించలేకపోతున్నారు. అలాగే పెన్షన్ రూ.2వేల నుంచి రూ.4వేల వరకు పెంచాలని ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఆడపిల్లలకు పేద కుటుంబాల కోసం ప్రవేశపెట్టిన బృహత్తర పథకం కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ అని, ఈ పథకంఒల రూ.51వేలు అందించి కేసీఆర్ రాష్ట్రంలో ఆడ పిల్లల కుటుంబాలు పడుతున్న బాధలను చూసి రూ.లక్ష 116కు పెంచి వారిలో సంతోషాన్ని నింపాడని తెలిపారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి రూ.2వేల నుంచి రూ.4వేల వరకు పెంచుతానన్న పెన్షన్, రైతులందరికి సంపూర్ణంగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి ఇదీ నెరవేర్చకుండా పొంతనలేని మాటలతో కాలం వెల్లదీస్తున్నారన్నారు. అనంతరం అంబేద్కర్‌చౌరస్తా వద్ద టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే టీ తాగారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నెప్రేమలత, వైస్‌చైర్మన్ గున్నాల భగత్, భీమ్‌గల్ సొసైటీ చైర్మన్ నర్సయ్య, తహసీల్దార్ మహమ్మద్‌షబ్బీర్, కౌన్సిలర్లు నర్సయ్య లింగంనాయక్, సతీష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రైతులకు కిచ్చిన హమీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అముల చేయాలని డిమాండ్ చేస్తు జగిత్యాల జిల్లా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల ంజీవ్ రావు చెల్‌గల్ నుండి జగిత్యాల వరకు మంగళవారం చేపట్టిన పాదయాత్ర ప్రాంభ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం వెలుతు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కొద్దసేపు కమ్మర్‌పల్లి సొసైటి కార్యాలయంలో ఆగారు. ఈ సందర్భంగా తన అనుచరవర్గంతో కలిసి కమ్మర్‌పల్లి లోని ఓ హోటల్‌లో బెల్లంటీ తాగారు. ఆయనతో పాటు సహకార సంఘం చైర్మన్ రేగుంట దేవేందర్, నాయకులు బద్ద చిన్నారెడ్డి, గడ్డం స్వామి బద్రి, సుభాష్ గౌడ్. మైలారం సుధాకర్, నేష్ తదితరులు పాల్గొన్నారు.

● తల్లిదండ్రులు పిల్లలకు చదువుతో పాటు క్రీడల్లో ప్రొత్సహించాలి

వేల్పూర్: ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు తల్లిదండ్రులు చదువుతో పాటు క్రీడల్లో ప్రొత్సహించాలని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం వేల్పూర్ మండలం మోతె గ్రామ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేల్పూర్ మండల 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను క్రీడా జ్యోతిని వెలిగించి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం వివిధ పాఠశాలల క్రీడాకారులు మార్చ్ ఫస్ట్ నిర్వహించగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమస్ఫూర్తి కలిగిన మోతె గ్రామానికి అన్ని విధాలా మంచి జరుగుతుందన్నారు. మలి దశ తెలంగాణ ఉద్యమానికి మోతె గ్రామం ఊపిరుదిందన్నారు. తెలంగాణ రాష్ట్రం రావడంలో మోతె గ్రామం ముఖ్యభూమిక పోషించి ఉద్యమంలో పాలుపంచుకుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కేసీఆర్‌తో పాటు ఉద్యమంను తమ ఊరంత ఉంటామని ఏకగ్రీవంగా తీర్మాణం చేసిన మొదటి గ్రామం మోతెనే అని అన్నారు. అనాడు ఉద్యమనాయకుడు కేసీఆర్ ఉద్యమస్ఫూర్తిని పొందేందుకు మోతె మట్టిని ముడుపుకట్టి తెలంగాణ భవన్‌కు తీసుకువెళ్ళారన్నారు. మళ్ళీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం హోదాలో కేసీఆర్ మోతెకు వచ్చి ముడుపు విప్పరన్నారు. ఆటల్లో గెలుపు, ఓటమిలు సహజమని, విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవా లన్నారు. జీవితంలో ఎదురయ్యే ఆటుపోటులను ఎదుర్కొని నిలబడడానికి, శరీరధారుడ్యానికి, మానసిక ఉల్లాసానికి, క్రీడలు మనకు మనోనిబ్బరాన్ని, ధైర్యాన్ని ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రేణుక, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నాగమణి, సొసైటీ చైర్మన్ మోతె రాజేశ్వర్, హెచ్ఎం వైద్యగణేష్, మాజీ ఎంపీటీసీ డొల్ల రాజేశ్వర్, పీఆర్‌టీయు మండల అధ్యక్ష, కార్యదర్శులు దేవనందం, సీవీ.నర్సింగ్‌రావు, వీడీసీసభ్యులు, హెచ్ఎం,టీచర్లు పీఈటీలు పాల్గొన్నారు.

ముగ్గురిపై బదిలీ వేటు

ఆర్మూర్‌టౌన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంనగర్‌లోని బీసీ బాలికల వసతిగృహంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురిపై మంగళవారం ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వసతిగృహంలో విద్యార్థుల అవస్థలపై ప్రజావాణిలో ఫిర్యాదు రావడంతో జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారిణి స్రవంతి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికా రులు గంగాధర్, నర్సయ్యలు వసతిగృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులను సమస్య లను అడిగితెలుసుకున్నారు. అనంతరం హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న వాచ్‌మెన్,కుక్, స్వీపర్‌లను బదిలీ చేసినట్లు హాస్టల్‌వార్డెన్ శ్యామల తెలిపారు.

మద్యానికి బానిసై వృద్ధుడి మృతి

ముప్కాల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రానికి చెందిన గంధపు గంగాధర్(70) వరదకాలువలో దూకి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా మద్యం తాగి బయటకు వెళ్లి తిరిగి వస్తుండేవాడని, అదే విధంగా సోమవారం ఉదయం 11గంటలకు మద్యం తాగి ఇంటి నుంచి బయటకువెళ్లి కిసాన్‌నగర్ ఎస్సారెస్పీ వరదకాలువ బ్రిడ్జి వద్దకు వెళ్లి జీవితంపై విరక్తి చెంది నీటిలో పడి మృతి చెందాడన్నారు. మృతుని కొడుకు శ్రీని వాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జక్రాన్‌పల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో గల సంతోష్‌నగర్ కాలనీకి చెందిన ఆలకుంట పెద్ద వెంకట్(59) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున టీవీఎస్ ఎక్సెల్‌పై పొలానికి వెళ్ళి వస్తుండగా తొర్లికొండ గ్రామశివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనగా వెంకట్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకట్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని కొడుకు వెంకట్‌రాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సభ్యత్వ నమోదులో బీజేపీ ముందజ

ఏర్గట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదులో బిజేపి ముందజలో ఉందని బాల్కొండ బీజేపీ పార్టీ సభ్యత్వ కోకన్వీనర్ నరేష్ తెలిపారు. మంగళ వారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు ఎలేటి నారాయణ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంంలో పెద్ద ఎత్తున్న సభ్యత్వం చేయించిన కార్యకర్త లకు అభినందలు తెలిపారు. అలాగే మరింత సభ్యత్వ నమోదుకై నవంబర్ 15 లోగా పూర్తి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బద్ధం సురేష్ రెడ్డి, ఆనందం గంగేశ్వర్, రంజిత్‌లు పాల్గొన్నారు.

ప్రతీ బూత్‌స్థాయిలో క్రియాశీల సభ్యత్వం పూర్తి చేయాలి

ఆర్మూర్‌టౌన్, నవంబర్12(ఆంధ్రజ్యోతి) ప్రతీ బూత్‌స్థాయిలలో క్రియశీల సభ్యత్వం పూర్తి చేయాని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్ స్థాయి అధ్యక్షుడు, మండల పదాధికారులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జీల సమావేశంలో ఆయన పాల్గొని దిశనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భద్రచలం ఇన్‌చార్జీ అమ్దాపూర్ రాజేశ్వర్, మాజీజడ్పీటీసీ సొంధన్న, మండల అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, కార్యదర్శులు రాజేందర్, వినోద్, బూత్ అధ్యక్షులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

బాన్సువాడలో బోర్‌బావి తవ్వకం ప్రారంభం



బోర్‌బావి తవ్వకాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడటౌన్ , నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని 2 వ వార్డులో మంగళవారం మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్ బోర్‌బావి తవ్వకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు తమతమ కాలనీల్లో గల బోర్ నీటిని సద్వినియోగం చేసుకోవాలని , నీటిని వృథా కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మోతీలాల్, నార్ల ఉదయ్ , శ్రీకాంత్ , లింగం , తదితరులున్నారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకొని వ్యక్తి మృతి



మృతి చెందిన నడ్పి గంగారాం

జక్రాన్‌పల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి చెం దిన చిలుకూరి నడ్పి గంగారాం(67) ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మృతి చెం దినట్లు ఎస్సై సీహెచ్. తిరుపతి తెలిపారు. సోమవారం రాత్రి ఇంట్లో మంచంపై పడుకొని బీడీ తాగుతుండగా ప్రమాదవశాత్తు బీడీకి ఉన్న నిప్పురవ్వలు పరుపు మంచంపై పడి మంటు చెలరేగగా మంటల్లో నడ్పి గంగారాం కాలిపోయాడు.. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా చికిత్స పొందుతూ నడ్పి గంగారాం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

రెంజల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయ 4వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో హోమం,ప్రత్యేక పూజలతో పాటు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి, ప్రభాకర్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడలో క్రీడా దుస్తుల వితరణ

వేల్పూర్, నవంబర్12(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థులు ఏర్పాటు చేసిన మన బడి మన నిధి ఫౌండేషన్ సభ్యులు మంగళవారం క్రీడా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రమేష్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు వల్లం రవిపటేల్, కొల్లె భోజన్న, గోర్తె చక్రపాణి, ఆది, మహిపాల్, సూర్‌నీడ బాస్కర్, బోండ్ల సచిన్, గ్రూప్‌సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నింబాచల క్షేత్రంపై గరుడ సేవ



భీమ్‌గల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి):లింబాద్రిగుట్టపై శ్రీలక్ష్మీనర్సిం హుని బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగు తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళ వారం గరుడ సేవ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కొండపై శ్రీలక్ష్మీనర్సింహుని ఉత్సవ విగ్రహాలను పల్లకీ లో మంగళ వాయిళ హారతులు, మేళతాళలు, భాజ భజంత్రిలు వెంటరాగా గరుడ వాహ నంపై ప్రతిష్టించారు. రం గురంగుల పూలు, స్వర్ణాభారణాలతో స్వా మిని అలంకరించారు. పల్లకిలో ఆశీనులైన శ్రీలక్ష్మీనర్సింహులను కొండ మాడ వీదులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తజనం గోవింద నామస్మరణాలతో ముందుకు కదిలారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



టీయూ రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి నాయకులు

డిచ్‌పల్లి,నవంబరు 12(ఆంధ్రజ్యోతి):బాసర ట్రిబుల్ ఐటీ పీయూసీ 2వ సంవత్సరం చదువుతున్న స్వాతి ప్రియహాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని, పరామర్శకు వెళ్తే వి ద్యార్థిని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తే ఏబీవీపీ నాయకులను అక్కడి వర్సిటీ అధికారులు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందితో దాడులు చేయించడం బాధాకరమని, ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, మాట్లాడుతూ.. గతంలో కూడా ఓవిద్యార్థి చనిపోతే బాసర విద్యార్థులు వారానికోకరు చనిపోయిన కనీసం పట్టించుకోకుం డా విద్యార్థుల ఆత్మహత్యాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏబీవీపీనాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్సిటీలో మౌలిక వసతులు కల్పించాలి



వీసీకి వినతి పత్రం అందజేస్తున్న లంబాడ ఎల్ఎస్ఓ అధ్యక్షుడు జీవన్

డిచ్‌పల్లి,నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీయూలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మంగళవారం లంబాడ స్టూడెంట్ ఆర్గానైజేసన్ ఆధ్వర్యంలో వీసీ యాదగిరిరావుకు వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీ వన్ నాయక్ మాట్లాడుతూ..వర్సిటీలో అధ్యాపకుల కొరత వెంటనే భర్తీ చేయాలని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన వినతి ప త్రం అందజేశారు. ఆయన వెంట నాయకులు హనుమాన్‌సింగ్, సంతోష్, పాల్గొన్నారు.

రుద్రూరులో కాకడ హారతి



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కోటగిరి,నవంబరు12(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలోని విఠలేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కార్తీక మాసం ఏకాదశిని పురస్కరించుకుని కాకడ హారతి, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున 5గంటలకు భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు, మంగళ హారతులు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గత 15ఏళ్ల నుంచి ఆలయంలో కార్తీక మాసం ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి సాయిలు, అర్చకులు నారాయణ శర్మ, రాము శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి: యెండల



ఏబీవీపీ నాయకుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే యెండల

బాన్సువాడటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ధర్నా తలపెట్టిన ఏబీవీపీ కార్యకర్తలపై అక్కడ విధులు నిర్వహిస్తున్నటువంటి సీఎస్‌వో రాకేశ్ ప్రైవేటు సిబ్బందితో దాడి చేయించిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే యెండెల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన క్షతగాత్రున్ని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ వరుస ఆత్మహత్యలకు నిలయంగా మారిందన్నారు. సీఎస్‌వో రాకేశ్ ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని, అక్కడ జరుగుతున్న ఆత్మహత్యలపై న్యాయవిచారణ జరిపించాలని, అంతేకాకుండాదాడికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మగ్గిడి విద్యార్థులు

ఆర్మూర్‌రూరల్,నవంబరు 12(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మండల మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలబాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు హరిత, వ్యాయమ ఉపాధ్యాయుడు మధు తెలిపారు. ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 వాలీబాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బాలబాలికల జట్లు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. ఉత్తమ ప్రతిబ కనబరిచిన మగ్గిడి విద్యార్థులు గుణదీప్, ప్రణిత, హీమప్రియ, విజ్ఞతలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈనెల 16నుంచి చేగుంటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో వారు పాల్గొంటారన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

ముప్కాల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి):ఖమ్మం జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అం డర్ -17 ఖోఖో పోటీలు నిర్వహించగా బాల్కొండకు చెందిన కేజీబీవీ విద్యార్థిని మైథిలి జాతీయస్థాయికి ఎంపిక కాగా బాల్కొండ మోడల్ స్కూల్ విద్యార్థిని బి.అపర్ణలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా పీడీ ముత్తెన్న, ప్రత్యేక అధికారి భవాని, విద్యార్థులను అభి నందిం చారు. జాతీయస్థాయి నుంచిఅంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



వరి కొయ్యలకు నిప్పు భూసారానికి ముప్పు

- గ్రామాల్లో వరి కొయ్యలకు నిప్పు పెడుతున్న రైతులు
- నిప్పు పెట్టడంతో భూసారం దెబ్బ తింటుందంటున్న వ్యవసాయ శాఖ అధికారులు
- భూమిలోని మిత్ర పురుగులు అంతరిస్తాయి: శాస్త్రవేత్తలు

నవీపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగుపూర్తి కావడంతో యాసంగి పంటల సాగు కోసం రైతులు తమ భూములను సిద్ధం చేస్తున్నారు. గతంలో వరి పంట కోతలను మొదళ్ల వరకు కొడవళ్లతో కోసేవారు. అనంతరం ధాన్యాన్ని సేకరించి వరిగడ్డిని కట్టలు కట్టి పశుగ్రాసానికి వినియోగించేవారు. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో పాటు కూలీల కొరత ఏర్పడడంతో ఆధునిక వ్యవసాయ పద్ధతుల అనుసరణలో భాగంగా హార్వెస్టర్ల ద్వారా వరి కోతలను చేపడుతున్నారు. దీంతో వరికొయ్యలు పెద్దవిగా పొలంలో మిగిలిపోతున్నాయి. దుక్కి దున్నే సమయంలో నాగళ్లకు వరికొయ్యలు అడ్డు వస్తున్నాయని భావిస్తూ పలుచోట్ల రైతులు వరికొయ్యలకు నిప్పంటిస్తున్నారు. దీంతో భూమిలో ఉండే మిత్రపురుగులు అంతరించడంతో పాటు భూసారానికి ముప్పు కలుగుతుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. పైగా వాతావరణ కాలుష్యం ఏర్పడడంతోపాటు పంట పొలాల్లో ఉండే బోర్లకు చెందిన కెబుల్‌వైర్లు, ఫ్యూజ్ డబ్బాలు కాలిపోయే ప్రమాదం ఉంది. అనుకోకుండా వరికొయ్యలకు అంటించిన నిప్పు సమీపంలో ఉన్న ఇళ్లవద్దకు చేరే ప్రమాదం కూడా ఉంటుంది. రోడ్లకు ఇరువైపులా వరికొయ్యలకు నిప్పంటించడంతో పెద్దగా పొగ ఏర్పడడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. దీనిద్వారా అనుకోకుండా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. రైతులు రోటవెటర్ ద్వారా నేలలోనే గడ్డిని కలియ దున్నాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



వరి కొయ్యలకు నిప్పంటించడంతో రోడ్డుపై పొగ ఏర్పడిన దృశ్యం

వరి కొయ్యలకు నిప్పంటిస్తే మిత్ర పురుగులు అంతరించే ప్రమాదం

- నవీన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి, నవీపేట

వరికొయ్యలకు నిప్పంటించి భూమిని దుక్కి దున్నడానికి రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయి. వరికొయ్యలకు నిప్పంటించడంతో భూమిలో ఉన్న మిత్రపురుగులు అంతరించే ప్రమాదం ఉంది. పైగా భూమిలో ఉండే సేంద్రియ కర్బనం సైతం నశిస్తుంది. వాతావరణ కాలుష్యం సైతం ఏర్పడనుంది. రైతులు రోటవెటర్ ద్వారా వరికొయ్యలను భూమిలో కలియ దున్నితే భూసారం పెరిగి పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.

లింగంపేటలో రూ.100కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల

- పాల్కంపేటలో బస్తీ ఆస్పత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే



పాల్కంపేటలో బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

లింగంపేట, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): లింగంపేటలోని మోతె శివారులో రూ.100కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. ఆయన మంగళవారం లింగంగపేట మండలకేంద్రంలోని మైనారిటి గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను, భోజనాన్ని అందించేందుకు వారికి మెస్‌చార్జీలను పెంచినట్లు ఆయన తెలియజేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకుని చదువులో ముందుండాలని ఆయన సూచించారు. తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో తాను చదువుకుంటున్నప్పుడు అప్పటి ఎంపీ తాడూరి బాలాగౌడ్ మాటలను స్ఫూర్తిగా తీసుకుని బాగా చదువుకుని రాజకీయాల్లోకి వచ్చానని విద్యార్థులకు తెలియజేశారు. కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వరకు త్వరలోనే నాలుగులైన్ల రోడ్డు నిర్మాణపనులు ప్రారంభిస్తామని తెలియజేశారు. నాగన్న బావిని టూరిజం కేంద్రంగా తయారు చేశామని తెలియజేశారు. అనంతరం పాల్కంపేటలో నూతనంగా నిర్మించిన బస్తీ దవాఖానాను ప్రారంభించారు. రూ.3.37కోట్లతో పెద్దవాగుపై నిర్మించిన వంతెనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మైనారిటి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత, వైస్ చైర్మన్ రాజు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, తదితరులున్నారు.



లింగంపేటలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్



జర దేఖో!!

బెటాలియన్‌లో రాళ్లు తేలిన రోడ్లు

పోలీస్ బెటాలియన్ రోడ్లు అధ్వానం

- డిచ్‌పల్లిలో కంకర తేలి గుంతల మయంగా రహదారులు
- పట్టించుకోని అధికారులు





గుంతలమయంగా బెటాలియన్ అంతర్గత రోడ్లు

డిచ్‌పల్లి, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా క్రమ శిక్షణకు మారుపేరున్న 7వ బెటాలియన్‌లో సమస్యలు రాజ్యమేలుతున్న పరిష్కారానికి అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గత పదేళ్లుగా బెటాలియన్ రోడ్లు కంకర తేలి, గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. సరైన రోడ్డు లేక వాహనాలకు తీవ్ర ఇక్కట్లు పడుతున్న అధికారులు మాత్రం మరమ్మతులు చేయించడంలో మీనమేశాలు లెక్కిస్తున్నరని బెటాలియన్ పోలీసులు పలువురు 'ఆంధ్రజ్యోతి'తో వాపోయారు. బెటాలియన్ పోలీస్ ఉన్నతాధికారులు కూడా గుంతల రోడ్లపైనే వెళ్తున్నరని, వాటి బాగోగులు పట్టించుకోవడం లేదన్నారు. ద్విచక్రవాహనాలు రాళ్లు తేలిన రోడ్లపై వెళ్త ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏన్నో సార్లుమ ద్విచక్ర వాహనాల టైర్లు పంక్చర్‌లు జరిగాయని వాపోతున్నారు. బెటాలియన్ సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదించిన సమస్య మాత్రం ఎక్కడవేసిన గొంగడి అక్కడే అనే చందంగా మారిందని, బెటాలియన్ సిబ్బంది వాపోతున్నారు. రాష్ట్రప్రభుత్వంతోపాటు రూరల్ ఎమ్మెల్యే డా. భూపతిరెడ్డి ఎంపీ అర్వింద్, అధ్వానంగా తయారైన రోడ్లను బీటీ రోడ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆంధ్రజ్యోతి ఫోకస్



కార్యాలయం వద్ద చెత్త

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

- ప్రమాదకరంగా పురాతన భవనాలు
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది
- చినుకు పడితే అంతా బురదమయం
- ఆవరణలో పేరుకున్న పిచ్చిమొక్కలు
- పశువుల స్వైరవిహారం ఆఫీసుల ముందు

భీమ్‌గల్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. మండల విద్యా వనరుల కేంద్ర భవనం, వ్యవసాయ శాఖ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. వర్షాకాలం అంతా అధికారులు భయపడుతూ పనిచేశారు. వర్షానికి స్లాబ్ నుంచి నీరు లీకవుతుండడంతో బిక్కుబిక్కుమంటూ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో స్లాబ్‌పై నీరు లీకేజీ కాకుండా పన తాటిపత్రి వేసుకుని అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే నిత్యం వందలాది మంది ప్రజలు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న కరెంటు, ఐకేపీ ఈజీఎస్, ఎంఈవో, అగ్రికల్చర్ కార్యాలయాలకు వస్తుంటారు. వర్షం పడితే గ్రౌండ్ మొత్తం బురదమయంగా మారుతున్న పట్టించుకునే నాథుడే లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందులు స్వైర విహారం చేస్తూ మొత్తం పిచ్చిమొక్కలతో డంపింగ్ యార్డుగా మారిపోయింది. అలాగే చుట్టు పక్కల ఉన్న ఇంటి యాజమానులు వాహనాలకు కార్యాలయ ఆవరణలో ఉంచుతున్న అధికారులు పట్టించుకోవడంలేదు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారాయి. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టాలని, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టి ప్రైవేటు వాహనాలు ఆవరణలో పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన విద్యా వనరుల కేంద్రం భవనం



కార్యాలయ ఆవరణలో సంచరిస్తున్న పందులు ఇలా..

ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై సర్వే ఒత్తిడి తగ్గించాలి

కామారెడ్డి టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై సర్వే ఒత్తిడి తగ్గించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలను ఒంటి గంట వరకు నిర్వహించి ఆ తర్వాత సర్వేకి వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించిందని కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదని అన్నారు. కిందిస్థాయి అధికారులు ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు షోకాజ్ నోటీసులంటూ బెదిరిస్తున్నారని ఈ రకమైన బెదిరింపుల వల్ల సర్వే సక్రమంగా జరిగే అవకాశం లేదన్నారు. సర్వే చేయాల్సిన కుటుంబాల సంఖ్య ను ఒక్కో ఎన్యూమరేటర్‌కు 100 మాత్రమే కేటాయించి ఎన్యూమరేటర్ల సంఖ్యను పెంచాలని తెలిపారు.

బస్వాపూర్ విండో అవిశ్వాస ఫలితాలను ప్రకటించాలి

భిక్కనూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్ విండో చైర్మన్ కిష్టాగౌడ్‌పై జరిగిన అవిశ్వాస ఫలితాలను జిల్లా కో ఆపరేటివ్ అధికారులు వెంటనే ప్రకటించాలని ఇన్‌చార్జి చైర్మన్ మద్ది స్వామి, డైరెక్టర్లు మంగళవారం డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ గత ఏప్రిల్ 4న చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడం జరిగిందని, ఈ ఫలితాలపై హైకోర్టు ఆదేశించినా ఇప్పటికీ జిల్లా అధికారులు ప్రకటించడం లేదని అన్నారు. వెంటనే అధికారులు అవిశ్వాస ఫలితాలను ప్రకటించి న్యాయవ్యవస్థను కాపాడాలని లేనియెడల కమిషనరు దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విండో డైరెక్టర్లు పాల్గొన్నారు.



సలాబత్‌పూర్‌లో వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు

మహారాష్ట్ర సరిహద్దులో పోలీసుల తనిఖీలు

మద్నూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర సరిహద్దులోని సలాబత్‌పూర్ చెక్‌పోస్టు వద్ద తెలంగాణ రాష్ట్ర పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. మహారాష్ట్రలో ఈనెల 20న అసెంబ్లీ ఎన్నికలు ఉన్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మహారాష్ట్రకు అక్రమంగా డబ్బులు, మద్యం వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. అందుకు గాను చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టు వద్ద బిచ్కుంద సర్కిల్ పరిధిలోని పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. 24 గంటల పాటు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను తనిఖీ చేస్తూ మద్యం డబ్బు దొరికినట్లయితే కేసులను నమోదు చేస్తున్నారు. అదే విధంగా మద్నూర్ మండలంలో పత్తి, సోయా, వరి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి ధాన్యం అక్రమంగా రాకుండా కట్టుదిట్టమైన చర్యలను చేపట్టింది.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విక్టర్

హార్వెస్టర్ యజమానులు రైతులకు అండగా నిలవాలి

కామారెడ్డి టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): హార్వెస్టర్ యజమానులు రైతులకు అండగా నిలవాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. మంగళవారం జిల్లా రవాణాశాఖాధికారి కార్యాలయంలో హార్వెస్టర్ యజమానులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో ఇప్పటికే 70శాతం ధాన్యం కోతలు పూర్తయ్యాయని వచ్చే సీజన్ నాటికి విలేజ్ యాక్షన్ ప్లాన్ తయారు చేస్తామని తెలిపారు. దాని ప్రకారమే హార్వేస్టర్‌లు గ్రామాల్లోకి కోతలు కోయడానికి వెళ్లాల్సి ఉంటుందని, పరిపక్వత చెందని వరి ధాన్యం కోయడం నేరమని తెలిపారు. వ్యాపార ధ్రుక్పథంతో కాకుండా రైతుల సంక్షేమాన్ని హార్వేస్టర్ యజమానులు దృష్టిలో ఉంచుకుని అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్పీ నరసింహారెడ్డి, వ్యవసాయ, సివిల్ సప్లయ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

మాచారెడ్డి,నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం డీఈవో రాజు తనిఖీ చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు కలర్‌పార్టీ ద్వారా స్వాగతం పలికారు. విద్యార్థులప్రగతి, పాఠశాల పనితీరు ఉపాధ్యాయుల హాజరుశాతం పరిశీలించి అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఇష్టంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. రాష్ట్రస్థాయిలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఉన్నత స్థానం సాధించినందుకు విద్యార్థులను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఎల్లయ్య, దేవేందర్‌రావు, డిప్యూటీ డీఈవో బాలరాంనాయక్,లచ్చపేట పీజీ హెచ్‌ఎం రాజేశ్వర్‌రెడ్డి,మాచారెడ్డి పీజీహెచ్‌ఎం వెంకటచారి,పాఠశాల హెచ్ఎం శారద తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు సెంటర్‌ను పరిశీలించి అదనపు కలెక్టర్

దోమకొండ, (బీబీపేట)నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):బీబీపేట మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. సెంటర్‌లో వివిధ విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కాంట చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, తహసీల్దార్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సుతారి రమేష్, సీఈవో నర్సగౌడ్, డైరెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులు,రైతులు పాల్గొన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

● మైసమ్మ ఆలయంలో హుండీ డబ్బుల లెక్కింపు

నసురుల్లాబాద్: నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని మైలారం గ్రామ శివారులోని కొచ్చేరి మైసమ్మ ఆలయంలో మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు ఉండి డబ్బులను లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి వారం హుండీ డబ్బులను లెక్క పెట్టడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే పకడ్బందీగా చేయాలి

బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



మద్నూర్‌లో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

మద్నూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో కుటుంబ సర్వే కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ స్థితిగతులతో పాటు కులగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేకు అందరూ సహకరించాలని అన్నారు. సర్వే సమాచారాన్ని ప్రమాణికంగా తీసుకొని పథకాలు రద్దు చేస్తారనే దుష్ప్రచారాన్ని నమ్మవద్దని సమస్యల గురించి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మీ ఇంటికి వచ్చిన సర్వే అధికారులకు 76 కాలమ్స్ గల సమాచారాన్ని ఇవ్వాలని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ సర్వే అధికారులతో మాట్లాడుతూ మీకు సర్వేలో ఎటువంటి సమస్యలు వస్తున్నాయో ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాటిని పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. ఆమెతో పాటు బాన్సువాడ డీఎల్‌పీవో నాగరాజు, ముజీబ్, ఎంపీడీవో రాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్ తదితరులు ఉన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో సబ్ కలెక్టర్

ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసినట్లు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మంగళవారం డోంగ్లి మండలంలోని మాదన్‌హిప్పర్గా గ్రామంలోని ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఇప్పటి వరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రైతులు వేసిన కుప్పలను ఆమె పరిశీలించారు. ప్రభుత్వం రూ.2320 చొప్పున కొనుగోలు చేస్తుందని సన్న ధాన్యంకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. రైతులు దళారీల వద్ద వరి ధాన్యం విక్రయించరాదని ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

అన్ని గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కులగణన సర్వే

దోమకొండ: దోమకొండ, బీబీపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో సమగ్ర కుల గణన సర్వే కొనసాగుతుందని ఎంపీడీవోలు ప్రవీణ్ కుమార్, పూర్ణచంద్రోదయ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. కాగా దోమకొండలోని పలుగడ్డ ప్రాంతంలో నిర్వహిస్తున్న సర్వేను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు సీతారాం మధు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, యూత్ నాయకులు పులబోయిన రమేష్, బుర్రి లింగం, లింగం, ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, కిషన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేను పారదర్శకంగా చేయాలని మండల ఆర్‌ఐ అంజయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బేగంపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ మాట్లాడుతు సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదుచేసే సమయంలో పారదర్శకంగా ఉండాలని సూచించారు. దీంతో పాటుగానే కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

● సర్వేకు ప్రతీ కుటుంబం సహకరించాలి

కామారెడ్డిటౌన్: సర్వేకు ప్రతి కుటుంబం సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. మంగళవారం మున్సిపల్‌లోని ఆయా వార్డులో సమగ్ర సర్వేను పరిశీలించారు. సమగ్రసర్వేపై కొందరు అపోహాలు సృష్టిస్తున్నారని ప్రజలు నమ్మవద్దని తెలిపారు.

భిక్కనూరు: ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని భిక్కనూరు ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్నిగ్రామాల్లో సర్వే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుందని, సర్వేలో అధికా రులకు ప్రజలు సహకరించాలని, అధికారులు ప్రతి విషయాన్ని ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ కార్యదర్శులు, ఆయాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నాగిరెడ్డిపేటలో 30 శాతం సర్వే పూర్తి

నాగిరెడ్డిపేట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మండలంలో మంగళ వారం సాయంత్రం వరకు 30 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. ఎంపీడీవోతో పాటు మండల ప్రత్యేక అధికారిణి రత్నం మండలంలోని చీనూర్, వదల్పర్తి గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో మొత్తం 10,076 కుటుంబాలున్నట్లు గుర్తించామన్నారు. మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం 78 ఎన్యూమరేటర్ బ్లాక్‌లలో 67 మంది ఎన్యూమరేటర్ల ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 30 శాతం సర్వే పూర్తయినట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లు గ్రామాలలోని ప్రతి ఇంటింటికి వెళ్ళి సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు సురేందర్, అజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్,ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

● కుల గణనపై వస్తున్న అపోహలు ప్రజలను నమ్మవద్దు ● సర్వే అధికారులకు ప్రజలు సహకరించాలి : ఎమ్మెల్యే మదన్ మోహన్

ఎల్లారెడ్డి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న బస్టాండ్ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అధికారులకు సూచించారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి బస్టాండ్ నిర్మాణం జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో నిధులు లేక అసంపూర్తిగా ఉన్న పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని ఆయన అన్నారు. అనంతరం మండలంలోని అడవిలింగాల, జంగమయిపల్లి, అన్నాసాగర్, రుద్రారం, వివిధ గ్రామాలలో జరుగుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కుల గణనను చేపట్టే అధికారులకు గ్రామస్తులు సహకరించాలని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేతో రాష్ట్రంలో అట్టడుగు స్థాయిలో ఉన్న కులాలు ఇతర పేదలు, ఆర్థిక, అభివృద్ధి, రాజకీయంగా, సామాజికంగా గురించి తెలుసుకోవడం కోసమే అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మారెడ్డి రజితా వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షులు వినోద్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సామేల్, గఫర్, గోపికృష్ణ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో నిర్మిస్తున్న ఆసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే మదన్‌మోహన్

ప్రభుత్వ అధికారులపై దాడి అమానుషం

దోమకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ అధికారులపై జరిగిన దాడి అమానుషమని పంచాయతీ రాజ్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయిస్ యూనియన్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి నిజ్జని శ్రీకాంత్ అన్నారు. దాడికి నిరసనగా దోమకొండ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో ఉన్న ఉద్యోగులపై దాడి చేయడం పాశవికం అన్నారు.ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా ఉంటూ నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై దాడి చేయడం సమంజసం కాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు మనోహర్, మానిక్‌రావు, రాజు, రజనీ, శ్రీనివాస్, వెంకటేష్, ప్రశాంత్, సత్యం పాల్గొన్నారు.

బీర్కూర్: రెవెన్యూ ఉద్యోగులపై దాడికి నిరసనగా బీర్కూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది నల్ల బ్యాడ్జిలు ధరించి తమ నిరసన వ్యక్తంచేశారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగర్ల గ్రామంలో పరిశ్రమల ఏర్పాటు కోసం అక్కడి అధికారులు, సిబ్బంది సోమవారం స్థల సేకరణ కోసం వెళ్లారు. అయితే కొంత మంది వ్యక్తులు రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిని ఖండిస్తూ రెవెన్యూ అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తంచేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లత, డీటీ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

మద్నూర్: ప్రభుత్వ అధికారులపై దాడులను ఖండిస్తున్నామని మద్నూర్ తహసీల్దార్ ముజీబ్ అన్నారు. ఇటీవల వికారాబాద్ జిల్లాలో జిల్లా అధికారులపై జరిగిన దాడిని ఖండిస్తూ ఈ దాడులు సరైనవి కాదని మద్నూర్ మండల తహసీల్దార్ అన్నారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ఫార్మా కంపెనీలకు భూ సేకరణ విషయంలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, తహసీల్దార్, రెవెన్యూ తదితర అధికారులపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తహసీల్దార్ ఆధ్వర్యంలో మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల కోసం పని చేస్తున్నామని అటువంటిది అధికారులపై దాడి జరిగితే భద్రత ఎక్కడుందని ఆవేదన ఇలాంటి సందర్భాల్లో రాష్ట్ర ప్రభుత్వం సిబ్బందికి రక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



బీర్కూర్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న దృశ్యం

బస్సులు ఆపడం లేదని విద్యార్థుల రాస్తారోకో

ఎల్లారెడ్డి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చేందుకు మోడల్ స్కూల్, కళాశాల వద్ద బస్సులు ఆపడం లేదని ఇంటర్‌హాస్టల్ విద్యార్థులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. తమ చదువులకు అంతరాయం కలుగుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. డిపో మేనేజర్ స్పందించి బస్సు డ్రైవర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. బస్సులో ప్రయాణిస్తున్న పలువురు విద్యార్థులను కండక్టర్ కిందికి దించేయడంతో ఈ ఘటన చోటు చేసుకుంది.



రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

తిప్పాపూర్‌లో ఉచిత పశువైద్య శిబిరం

భిక్కనూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి ఆర్.దేవేందర్ గ్రామంలో ఆవులు, గేదేలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వాటికి పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు గర్భకోశ వ్యాధులున్నా పశువులకు ప్రత్యేకంగా చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షుడు కుంట లక్ష్మారెడ్డి, జంగంపల్లి పశువైద్యాధికారి డాక్టర్ అనీల్‌రెడ్డి, సిబ్బంది, కృష్ణ, మహేష్, సురేష్, భరత్, కార్యదర్శి భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండలం మైలారంలో పశు వైద్యాధికారులు మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారులు మాట్లాడుతూ శిబిరంలో పశు గణ అభివృద్ధి సంస్థ వారు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ పశు వైద్య శిబిరంలో పశువైద్యాధికారులు మహేష్, ఎస్.మారుతి, మణికుమార్, పశు వైద్య సహాయకులు తుకారం, వెంకటేష్, మహబూబ్, గోపాల మిత్ర సూపర్ వైజర్ తిరుపతి, గోపాల మిత్రులు సాయిలు, బాలరాజ్, సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతోనే అరికట్టవచ్చని డాక్టర్ సంజీవ్‌కుమార్ తెలిపారు. మండలంలోని భూంపల్లిలో మంగళవారం పశువులకు ఉచిత గాలికుంటు టీకాలను పంపిణీచేశారు. రైతులు పాడిపశువుల విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు భూమిరెడ్డి,ఏడీ షకీల్, డాక్టర్ రామచందర్,రమేష్, అహల్యాగోపాల మిత్రలు మురళి, కాశీరెడ్డి,రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



రేషన్‌బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్న పోలీసులు

రేషన్ బియ్యం పట్టివేత

బిచ్కుంద, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 35 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ నరేష్, ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించామని తెలిపారు. అదేవిధంగా మండలంలోని కందర్‌పల్లి గ్రామం నుంచి ఫత్లాపూర్ వైపు అనుమతులు లేకుండా రెండు టిప్పర్ల మొరం తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని శెట్లూర్ గ్రామ మంజీరా పరివాహక ప్రాంత నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

మాచారెడ్డి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్(ఎం) గ్రామంలో దొంగతనం కేసులో అదే గ్రామానికి చెందిన సిరికొండ అజయ్‌ను రిమాండ్ చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఈనెల 4న గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘంలో ఉన్న ఆంప్లిఫైర్ తాళాన్ని పగలగొట్టి ఎత్తుకెళ్లాడని తెలిపారు. మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎత్తుకెళ్లిన ఆంప్లిఫైర్‌తో అజయ్ పట్టుబడడంతో కేసు నమోదు చేసి రిమాండ్ చేశామని ఎస్ఐ తెలిపారు.

వీరాపూర్‌లో పశువుల కొట్టం దగ్ధం

బీర్కూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి గాండ్ల అశోక్‌కు చెందిన పశువుల కొట్టం, గడ్డి వాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో 15 ఎకరాల గడ్డి వాము,పశువుల కొట్టం పూర్తిగా దగ్ధం అయినట్లు బాధితులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో ఘటనా స్థలాన్ని చేరుకుని మంటలను ఆర్పారు. ఈ ఘటనలో లక్షా 30వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అశోక్ తెలి పారు.

చెరువులో స్నానానికి వెళ్లి ఒకరి మృతి

కామారెడ్డి టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పెద్దచెరువులో మంగళవారం ఉదయం గుర్తు తెలియని మహిళ శవాన్ని గుర్తించామని దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపారు. మృతురాలి వివరాలు సేకరించగా దాసరి మంజులగా గుర్తించామని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం కల్లు తాగేందుకు వెళ్లి ఆ తర్వాత స్నానానికై కామారెడ్డి పెద్ద చెరువు వద్దకు వెళ్లగా నీటిలో మునిగి మృతి చెందిందని తెలిపారు. మృతురాలి చెల్లెలు నిమ్మల శిరిష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కల్కి చెరువులో శవం లభ్యం

బాన్సువాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువులో మంగళవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. మహిళ వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందని, ఆమె ఒంటిపై ఎరుపు రంగు డిజైన్ చీర, నలుపురంగు, పింక్ రంగు జాకెట్ ధరించి ఉందని బాన్సువాడ పట్టణ సీఐ అశోక్ తెలిపారు. మృతదేహాన్ని గుర్తించినట్లయితే 8712686167 నెంబరుకు సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

గుర్తు తెలియని శవం లభ్యం

నాగిరెడ్డిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జెగ్గ చెరువు ఒడ్డున సోమవారం శవం లభ్యం కాగా, దీని ఆచూకీ లభ్యమైనట్లు మృతుడు ఎల్లారెడ్డికి చెందిన షేక్ అహ్మద్ అలియాస్ షేక్ హైదర్ హుస్సేన్ (70) గా గుర్తించినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. మృతుడు షేక్ అహ్మద్‌కు మతిస్థిమితం సరిగ్గా లేదని, ఈనెల 2వ తేదిన ఇంటి నుంచి బయలుదేరిన ఆయన తిరిగి ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఆయన తెలిపారు. సోమవారం కేంద్రంలోని జెగ్గ చెరువు ఒడ్డున గుర్తు తెలియని మృత దేహం లభ్యమైనట్లు తెలియడంతో మృతుడి భార్య షేక్ అఫ్జల్, కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని చూసి గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులోని నీటిలో పడి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. శవం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో సంఘటన స్థలం వద్దే ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ దిలీప్ శవానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

కుడా చైర్మన్ పదవిపై ఆశలు

(5వ పేజీ తరువాయి)

శ్రీనివాస్‌రెడ్డిల ఆశీస్సులు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు. చైర్మన్, డైరెక్టర్ పదవులకు తమ పేర్లను సిఫారస్ చేయాలని ఎమ్మెల్యేలను కోరారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు కుడా చైర్మన్ పదవికి పోటీలో ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చజరుగుతుంది. ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచిస్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కుడా చైర్మన్ పదవిని తమకే ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ సీనియర్ నేత లింగాగౌడ్ పేరును ఎమ్మెల్యే సిఫారస్ చేశారు.అయితే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన చంద్రకాంత్‌రెడ్డికి కట్టబెట్టారు. కూడ చైర్మన్ పదవి కామారెడ్డిని, ఎల్లారెడ్డికి దక్కుతుందో లేదో చూడాలి.

రాజంపేటలో రైతు నేస్తం

రాజంపేట,నవంబరు 12(ఆంధ్రజ్యోతి):రాజంపేట మండలకేంద్రంలోని రైతువేదికలో రైస్‌నేస్తం కార్యక్రమం నిర్వహించినట్లు నూతన వ్యవసాయ అధికారి శృతి తెలిపారు. ప్రతి మంగళవారం రైతువేదికలో జరిగే రైతు నేస్తం కార్యక్రమాన్ని మండల రైతులు వినియోగించుకుని శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని రైతులకు తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - లక్కీ భాస్కర్
దర్శన్ - అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
ప్రియా 35 - అమరన్
ప్రియా 70 - కా

బాన్సువాడ

మహేశ్వరి - కా
వెంకటేశ్వర - అమరన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

